

వైభవంగా చండీ యాగం

- ప్రత్యేక పూజలు చేసిన ఎంపీ కవిత దంపతులు
- హాజరైన ఎమ్మెల్సీలు సత్యవతిరాథోడ్, తక్కెళ్లపల్లి, మాజీ ఎమ్మెల్యే రెడ్యానాయక్



చండీ యాగం నిర్వహిస్తున్న ఎంపీ మాలోతు కవిత దంపతులు

మహబూబాబాద్ టౌన్, జనవరి 1 : మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని ఎంపీ క్యాంపు కార్యాలయంలో నూతన సంవత్సర ఆరంభం రోజున సోమవారం అరుణ హోమం, చండీ యాగాన్ని భక్తిశ్రద్ధలతో వైభవంగా నిర్వహించారు. తిరుమల తిరుపతి దేవస్థానం(టీటీడీ) వేదపండితులు అజయ్ మంత్రోచ్ఛరణల నడుమ ఎంపీ మాలోతు కవిత దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం 9.30 గంటలకు ఆరంభమైన యాగం మధ్యాహ్నం 2 గంటల వరకు కొనసాగింది. మాజీ మంత్రి, ఎమ్మెల్సీ సత్యవతిరాథోడ్, ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు, మాజీ శాసనసభ్యుడు డీఎస్.రెడ్యానాయక్, మునిసిపల్ ఛైర్మన్ డాక్టర్ పాల్వాయి రాంమోహన్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ ఛైర్మన్ గుడిపుడి నవీన్‌రావు హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఎంపీ మాలోతు కవిత మాట్లాడుతూ... ప్రజలంతా 2024 సంవత్సరంలో సుఖ సంతోషాలు, అష్టఐశ్వర్యాలు, ఆయురారోగ్యాలతో ఉండాలని దేవున్ని ప్రార్థించినట్లు తెలిపారు. ప్రజాక్షేమం కోసం యాగాన్ని నిర్వహించినట్లు పేర్కొన్నారు. అనంతరం ఎంపీ కవిత జన్మదినం సందర్భంగా ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ శ్రేణులు పెద్ద ఎత్తున తరలివచ్చి బొకేలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఆయా కార్యక్రమాల్లో డోర్నకల్, మరిపెడ మునిసిపల్ ఛైర్మన్లు వాంకుడోతు వీరన్న, గుగులోతు సిందూరకుమారి, జడ్పీటీసీలు లూనావత్ ప్రియాంక, శారద, జడ్పీ కోఆప్షన్ సభ్యుడు షేక్ మహబూబ్‌పాషా, మాజీ సర్పంచ్ ఎం.సుధాఅర్జున్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు పర్కాల శ్రీనివాస్‌రెడ్డి, మర్రి రంగారావు, కేఎస్ఎన్.రెడ్డి, మార్నేని వెంకన్న, ముత్యం వెంకన్న, బూర్ల ప్రభాకర్, చిట్యాల జనార్దన్, తేళ్ల శ్రీను, నాయిని రంజిత్, గుండా రాజశేఖర్, దాసరి రావిష్, బానోత్ రాము, శివ, అశోక్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

నిశ్చితార్థం జరిగిన పది రోజులకే..

- వేధింపులు తట్టుకోలేక యువతి ఆత్మహత్య
- ఫోన్‌లో మాట్లాడినందుకు అనుమానించిన యువకుడు
- జనగామ జిల్లా ఇప్పగూడెంలో ఘటన

8





సీఎంను కలిసిన మంత్రులు


నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని హైదరాబాద్‌లో సీఎం రేవంత్ రెడ్డిని ఆయన నివాసంలో మంత్రి సీతక్క కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఇందిరాగాంధీ చిత్రపటాన్ని బహుకరించారు. ఇక రాజ్‌భవన్‌లో జరిగిన కార్యక్రమంలో మంత్రి కొండా సురేఖ పాల్గొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, గవర్నర్ తమిళిసై సౌందర రాజన్‌ను కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారితో సెల్ఫీ దిగారు.

టెన్త్ విద్యార్థులపై ఫోకస్

- నేటి నుంచి ప్రత్యేక క్లాసులు
- 62 రోజుల శిక్షణతో వంద శాతం ఉత్తీర్ణతకు ప్రణాళిక
- ప్రతి నెల మూడు టెస్టులు.. ఒక ప్రీ ఫైనల్ పరీక్ష
- కలెక్టర్ చొరవతో ముందస్తు తరగతులు

మహబూబాబాద్‌లోని ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు (ఫైల్)





మహబూబాబాద్ ఎడ్యుకేషన్, జనవరి 1: జిల్లాలో ఈ ఏడాది పదవ తరగతి వార్షిక పరీక్షల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించేందుకు జిల్లా విద్యాశాఖాధికారులు పక్కా ప్రణాళికను సిద్ధం చేశారు. ఈ మేరకు పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు ఆదేశాలు సైతం జారీ చేశారు. మహబూబాబాద్ జిల్లాలో 127 ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు ఉండగా 2023-24 విద్యా సంవత్సరంలో పదవ తరగతిలో 4,405 మంది విద్యార్థులు విద్య నభ్యసిస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించిన ప్రభుత్వం నిర్ణయించిన కాలనిర్ణయ పట్టికతో పాటు ప్రతి రోజు ఉదయం, సాయంత్రం గంట చొప్పున ప్రత్యేక తరగతులు నిర్వహించేందుకు సన్నద్ధమయ్యారు. పరీక్షల్లో జిల్లా వంద శాతం ఫలితాలు సాధించే విధంగా పక్కా ప్రణాళికతో విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించనున్నారు.

62 రోజుల పాటు ప్రత్యేక తరగతులు

పదవ తరగతి సిలబస్‌ను డిసెంబరులోనే పూర్తిచేయించి పరీక్షలకు 62 రోజుల ముందు నుంచి సంసిద్ధత ప్రణాళికలను రూపొందించి అమలు చేసేందుకు సర్వం సిద్ధం చేశారు. అందులో భాగంగానే 2024 జనవరి 2 నుంచి ప్రత్యేక తరగతులు ప్రారంభం కానున్నాయి. కాగా, జనవరి 2 నుంచి మార్చి 18 వరకు 62 రోజుల పాటు ప్రతి రోజు ఒక్కొక్క సబ్జెక్ట్‌పై విద్యార్థులకు మాదిరి(3 స్లిప్ టెస్టులు) పరీక్షలు నిర్వహిస్తూ ఒక ప్రీ ఫైనల్ పరీక్ష కూడా నిర్వహించేందుకు ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు విద్యార్థులను సంసిద్ధులను చేస్తున్నారు. సర్కారు బడుల్లో ప్రతి రోజు ఉదయం 8.30 నుంచి 9.30 గంటల వరకు, సాయంత్రం 4.45 నుంచి 5.45 గంటల వరకు ప్రత్యేక తరగతులను నిర్వహిస్తూ వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి పెట్టనున్నారు.

జిల్లాలో 4,405 మంది విద్యార్థులు


జిల్లాలో ప్రభుత్వ, మోడల్ స్కూల్, కేజీబీవీ పాఠశాలలు 127 ఉండగా 4,405 మంది విద్యార్థులు పదవ తరగతి విద్య నభ్యసిస్తున్నారు. ఇందులో బాలురు 2,296, బాలికలు 2,109 మంది పరీక్షలు రాయనున్నారు. డిసెంబరు చివరి నాటికి సిలబస్ పూర్తి చేసిన సంబంధిత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పదిలో వంద శాతం ఉత్తీర్ణత సాధించటమే లక్ష్యంగా ప్రత్యేక తరగతులు నిర్వహించనున్నారు. విద్యార్థులు ఆయా సబ్జెక్టుల్లో సునాయాసంగా టెస్టులను రాయటమే కాకుండా మొదటి స్లిప్ టెస్టు కంటే ఆపై నిర్వహించే స్లిప్ టెస్టుల్లో ప్రగతి సాధించేందుకు చర్యలు చేపట్టారు. స్లిప్ టెస్టుల ద్వారా వెనుకబడిన విద్యార్థులను గుర్తించి సులువుగా అర్థమయ్యే విధంగా పాఠ్యాంశాలపై, ఆబ్జెక్టివ్ ప్రశ్నలు, లఘు తరహా ప్రశ్నలకు సమాధానాలు రాయగలిగే విధంగా తర్ఫీదునివ్వనున్నారు. అందుకు అనుగుణంగా విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశాలు నిర్వహించి అవగాహన కల్పించారు. వార్షిక పరీక్షలకు హాజరయ్యే ప్రతి విద్యార్థి ఉత్తీర్ణత సాధించేందుకు జిల్లా విద్యాశాఖ ప్రత్యేకంగా రూపొందించిన సమయ పాలన పట్టిక ప్రకారం విద్యార్థులను పాఠశాలలకు పంపించే విధంగా చూడాలని ప్రధానోపాధ్యాయులు సూచించారు.

ఈ ఏడాది వార్షిక పరీక్షల్లో 7 పేపర్లు

రాష్ట్ర ప్రభుత్వం ఈ ఏడాది పదవ తరగతి వార్షిక పరీక్షలను 7 పేపర్లతో నిర్వహించేందుకు షెడ్యూల్ విడుదల చేసింది. దీంతో 7 పేపర్లకు అనుగుణంగా మాదిరి ప్రశ్నాపత్రాలు, వాటికి వచ్చే మార్కుల ప్రకారం విద్యార్థులను సంసిద్ధులను చేసేందుకు అన్ని చర్యలు చేపట్టారు. డిసెంబరు చివరి నాటికి సిలబస్ పూర్తి చేయించిన విద్యాశాఖ జనవరి 2 నుంచి రెగ్యులర్ పీరియడ్‌లలో సిలబస్ రివిజన్ చేయించడంతో పాటు హెచ్ఎంలు ప్రత్యేక తరగతులను నిరంతరం పర్యవేక్షించేందుకు ఆదేశాలు జారీ చేసింది.

22 రోజులు సెలవులు మినహాయిస్తూ..

జిల్లా విద్యాశాఖ పదవ తరగతి విద్యార్థుల ప్రత్యేక తరగతులకు రూపొందించిన కాలనిర్ణయ పట్టికలో 22 రోజులు వివిధ పర్వదినాల సెలవులను మినహాయిస్తూ 62 రోజుల కాలనిర్ణయ పట్టికను తయారు చేసింది. ఈ నెల 2 నుంచి మార్చి 18 వరకు 84 రోజులు ఉండగా సెలవు దినాల్లో ప్రత్యేక తరగతులు లేకుండా సమయ పాలనతో కూడిన కాలనిర్ణయ పట్టికను తయారు చేసి అమలు చేసేందుకు జిల్లా కలెక్టర్ శశాంక సూచనల మేరకు ప్రత్యేక ప్రణాళిక రూపొందించి అమలు చేసి ఉత్తమ ఫలితాలు సాధించే విధంగా ప్రధానోపాధ్యాయులకు ఆదేశాలు జారీ చేశారు.



వంద శాతం ఉత్తీర్ణతే లక్ష్యం..
- రామారావు, జిల్లా విద్యాశాఖ అధికారి

జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదివే ప్రతి పదవ తరగతి విద్యార్థి వార్షిక పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించడమే లక్ష్యంగా పక్కా ప్రణాళికతో ప్రత్యేక తరగతులు నిర్వహించబోతున్నాం. వార్షిక ఫలితాల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించడంతో పాటు ఎక్కువ మంది విద్యార్థులు 10/10 జీపీఏ సాధించి రాష్ట్రంలో సింగిల్ డిజిట్‌లో జిల్లా నిలిచేందుకు కృషి చేస్తున్నాం. అందుకనుగుణంగా జిల్లా కలెక్టర్ సూచనలు, సలహాలతో ప్రత్యేక తరగతులు నిర్వహించేందుకు ప్రణాళిక రూపొందించి అమలు చేస్తున్నాం.

నూతన సంవత్సరం వెలుగులు నింపాలి

- ప్రజలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలి
- తనను కలిసేందుకు వచ్చేవారు నోటు పుస్తకాలు తేవాలి
- పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి



కేక్ కట్ చేసి వేడుకలు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే యశస్విని రెడ్డి

తొర్రూరు, జనవరి 1: నూతన సంవత్సరం ప్రజలందరి జీవితాల్లో వెలుగులు నింపాలని, ఎంతో ఉత్సాహంగా ప్రజలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని కోరుకుంటున్నట్లు పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి హనుమాండ్ల ఝాన్సీ రాజేందర్‌రెడ్డి అన్నారు. సోమవారం ఆంగ్ల నూతన సంవత్సరం సందర్భంగా తొర్రూరు డివిజన్ కేంద్రంలోని పార్టీ క్యాంపు కార్యాలయంలో కేక్ కట్ చేసి వేడుకలు ప్రారంభించారు. ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని కోరుకున్నారు. తమ వద్దకు వచ్చే నాయకులు, ప్రజలు బొకేలు, శాలువాలకు బదులుగా నోటు పుస్తకాలు, పెన్నులు, మొక్కలు తీసుకురావాలని అన్నారు. బహుమతుల రూపంలో వచ్చే పుస్తకాలు ఎంతో మంది పేద విద్యార్థులకు ఉపయోగపడతాయని చెప్పారు. మొక్కలు నాటి పెంచితే పర్యావరణాన్ని పరిరక్షించవచ్చని పేర్కొన్నారు. వీటి ద్వారా ఉపయోగం ఉంటుందని, శాలువా, బొకేలతో నిరుపయోగమని వారు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు సోమ రాజశేఖర్, పెదగాని సోమయ్య, కె.నిరంజన్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, అశోక్‌గౌడ్, చిత్తలూరి శ్రీనివాస్, అశోక్‌రెడ్డి, మేకల కుమార్, అచ్చిరెడ్డి, శ్రీను, భిక్షం తదితరులు పాల్గొన్నారు.



డంపింగ్ యార్డులో కాలుతున్న చెత్తకుప్పలు

డంపింగ్ యార్డు నిర్మాణం ఎప్పుడో?

- చెత్తా చెదారం, వ్యర్థాలతో దుర్గంధం
- అనారోగ్యం బారిన పడుతున్న ప్రజలు
- పట్టించుకోని మునిసిపల్ పాలక వర్గాలు

వివరాలు 8లో..

ఘనంగా నూతన సంవత్సర వేడుకలు

- కొంగొత్త ఆశలతో కొత్త వసంతానికి స్వాగతం
- కేక్‌లు కట్ చేసి.. శుభాకాంక్షలు తెలుపుకున్న ప్రజలు
- ఆలయాల్లో ప్రత్యేక పూజలు

మహబూబాబాద్ టౌన్, జనవరి 1 : జిల్లా వ్యాప్తంగా సోమవారం నూతన సంవత్సర వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఆదివారం రాత్రి పాత సంవత్సరానికి గుడ్ బై చెప్పి కొంగొత్త ఆశలతో కొత్త వసంతాన్ని ప్రజలు స్వాగతించారు. సరిగ్గా అర్ధరాత్రి 12 గంటలకు బాణసంచాలు కాల్చి కేక్‌లు కట్ చేసి వెల్‌కమ్ టు న్యూ ఇయర్, హ్యాపీ న్యూ ఇయర్ అంటూ కేరింతలు కొడుతూ నూతన సంవత్సరానికి స్వాగతం పలికారు. సోమవారం రోజున ఉదయాన్నే తలంటు స్నానాలు ఆచరించి నూతన దుస్తులు ధరించి ఆలయాలకు చేరుకుని ప్రత్యేక పూజలు చేశారు. 2024 సంవత్సరంలో తమకు అంతా శుభాలు జరగాలని వేడుకున్నారు. దీంతో ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఆపై తమ సన్నిహితులకు, బంధువులకు ఫోన్‌ల ద్వారా నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. దీనికి తోడు స్నేహితులు, బంధువుల ఇళ్లకు వెళ్లి స్వీట్లు తినిపించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఇక మహిళలు తమ ఇంటి ముంగిళ్లలో అందమైన రంగు రంగుల ముగ్గులు వేశారు. హ్యాపీ న్యూ ఇయర్-2024 అంటూ ముగ్గులు వేసి నూతన వత్సరాన్ని స్వాగతించారు. గత మూడు సంవత్సరాలుగా కొవిడ్ భయంతో అంతంత మాత్రంగానే నూతన సంవత్సర వేడుకలు చేసుకోగా ఈసారి అంగరంగ వైభవంగా జరుపుకున్నారు.



అనంతరం శ్రీవెంకటేశ్వర స్వామి దేవాలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్



మహబూబాబాద్ జిల్లా పోలీసు కార్యాలయంలో కేక్ కట్ చేస్తున్న ఎస్పీ సంగ్రామ్‌సింగ్‌జీ పాటిల్

మానుకోట పట్టణంలో..

మహబూబాబాద్ పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో స్థానిక శాసనసభ్యుడు భూక్య మురళీ నాయక్ నూతన సంవత్సర కేక్‌ను కట్

మిగతా 8వ పేజీలో

ఏటూరునాగారంలో ఉద్రిక్తత

- బైరి నరేష్‌ను అడ్డుకున్న అయ్యప్ప మాలధారులు
- నాస్తికవాదాన్ని ప్రోత్సహించొద్దని ఆగ్రహం
- తీవ్ర వాగ్వాదం.. స్వల్ప తోపులాట... నరేష్ కారు ముందుకు వెళ్లే క్రమంలో భక్తుడికి గాయాలు
- జీడివాగు వద్ద చెట్టుకు ఢీ.. నరేష్ సహా అనుచరుల పరార్


ఏటూరునాగారం రూరల్/ఏటూరునాగారం, జనవరి 1 : నాస్తికవాదంపై అయ్యప్ప భక్తుల ఆగ్రహం కట్టలు తెంచుకుంది. దేవుళ్లపై అనుచితంగా వ్యాఖ్యలు చేస్తే సహించబోమని నిరసనకు దిగారు. ములుగు జిల్లా ఏటూరునాగారంలో సోమవారం జరిగిన ఓ సమావేశానికి హాజరైన నాస్తికవాది బైరి నరేష్‌ను అయ్యప్ప భక్తులు అడ్డుకున్నారు. ఈ క్రమంలో తీవ్ర వాగ్వాదం చోటుచేసుకొని ఉద్రిక్తతకు దారి తీసింది.

ఏటూరునాగారం మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో భారతీయ నాస్తిక సంఘం ఆధ్వర్యంలో భీమాకోరేగావ్ స్ఫూర్తి దినోత్సవాన్ని నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథిగా బైరి నరేష్ హాజరయ్యారు. విషయం తెలుసుకున్న అయ్యప్ప భక్తులు అక్కడికి చేరుకున్నారు. నాస్తిక వాదాన్ని ప్రోత్సహించే ఇలాంటి సమావేశాలు నిర్వహించొద్దని అడ్డుకున్నారు. గతంలో అయ్యప్ప భక్తుల మనోభావాలు దెబ్బతినేలా నరేష్ మాట్లాడారని, మళ్లీ అలాంటి చర్యలకు పాల్పడేందుకు సమావేశాన్ని నిర్వహిస్తున్నారని విమర్శించారు.

దీనిపై నరేష్ మాట్లాడుతూ ఈ సమావేశంలో అలాంటి వ్యాఖ్యలేవీ ఉండబోవని స్పష్టం చేశారు. అయినా అయ్యప్ప భక్తులు శాంతించలేదు. వెంటనే ఇక్కడి నుంచి వెళ్లిపోవాలని నరేష్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రశాంతంగా ఉన్న ఏజెన్సీలో గొడవలు సృష్టించేందుకే ఇక్కడకు వచ్చావని కోపోద్రిక్తులయ్యారు. దీంతో సమావేశాన్ని నిర్వహించి తీరుతామని నరేష్ తేల్చి చెప్పడంతో వాగ్వాదం మరింత తీవ్ర రూపం దాల్చింది. సమాచారం అందుకొని అక్కడికి చేరుకున్న పోలీసులు సమావేశాన్ని రద్దు చేసుకోవాలని నరేష్‌కు సూచించారు. దీంతో ఆయన అయిష్టంగానే కార్యక్రమాన్ని రద్దు చేసుకున్నారు.

అయ్యప్ప భక్తుడికి గాయాలు

సమావేశాన్ని రద్దు చేసుకొని బయటకు వచ్చిన నరేష్ కారు ఎక్కి వెళ్లిపోయేందుకు సిద్ధమయ్యారు. అయినా అయ్యప్ప భక్తులు కారుకు అడ్డంగా వచ్చి నిరసన తెలిపారు. ఈ క్రమంలో కారును డ్రైవర్ ముందుకు కదలించగా పోగు నరసింహరావు అనే భక్తుడి కాలికి గాయమైంది. అయినా నరేష్ ఆగకుండా అక్కడి నుంచి కారులో మంగపేట వైపు వెళ్లిపోయారు.



బైరి నరేష్‌తో వాగ్వాదం చేస్తున్న అయ్యప్ప భక్తులు

ప్రమాదానికి గురైన కారు

ఏటూరునాగారం నుంచి తన అనుచరులతో బయల్దేరిన బైరి నరేష్ కారు జీడీవాగు సమీపంలోని కొమురం భీంనగర్ వద్ద చెట్టును ఢీకొని ప్రమాదానికి గురైంది. వాహనంలో ఎయిర్ బ్యాగులు ఓపెన్ కావడంతో పెను ముప్పు తప్పింది. బైరి నరేష్‌తోపాటు డ్రైవరు, మరో ఇద్దరు కారును అక్కడే వదిలేసి పరారయ్యారు. కారు ప్రమాదానికి గురైనట్టు స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు ఏటూరునాగారం పోలీసులు సంఘటన స్థలానికి చేరుకున్నారు. కారును స్వాధీనం చేసుకొని నరేష్‌తో పాటు ఆయన అనుచరులు పలువురిపై కేసు నమోదు చేశారు. ఇదే క్రమంలో నరేష్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ అయ్యప్ప భక్తులు జాతీయ రహదారిపై రాస్తారోకో చేశారు. గాయపడిన నరసింహరావును ఆస్పత్రికి తరలించారు.

కేసు నమోదు చేసిన పోలీసులు

అయ్యప్ప భక్తుల ఫిర్యాదు మేరకు బైరి నరేష్, మరికొంత మందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై గుర్రం కృష్ణ ప్రసాద్ తెలిపారు. మంగపేట వైపు అతడు ప్రయాణిస్తున్న వాహనం ప్రమాదానికి గురైందని, ఇది జరిగిన వెంటనే నరేష్‌తో పాటు వాహనంలో ఉన్న మరో ముగ్గురు అక్కడి నుంచి పారిపోయారని చెప్పారు. కారును స్వాధీనం చేసుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించామని అన్నారు.

మద్యం తాగి వాహనం నడిపిన వారిపై కేసుల నమోదు

దామెర, జనవరి 1: దామెర మండల పరిధిలో డిసెంబరు 31న అర్ధరాత్రి వరకూ మద్యం తాగి వాహనం నడుపుతూ పట్టుబడిన వారిపై దామెర పోలీస్ స్టేషన్‌లో కేసులు నమోదు చేశారు. ఎస్సై అశోక్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని ఆయా గ్రామాల్లో ఆదివారం అర్ధరాత్రి వరకూ వాహనాల తనిఖీలు నిర్వహించారు. ఈ నేపథ్యంలో మద్యం తాగి వాహనం నడుపుతూ పట్టుబడిన 22మందిపై కేసులు నమోదు చేసినట్లు వివరించారు. ఎక్కడా కూడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా దామెర పోలీస్ స్టేషన్ ఏఎస్సైలు, హెడ్ కానిస్టేబుళ్లు, సిబ్బంది గట్టి బందోబస్తు నిర్వహించారని ఎస్సై తెలిపారు.



ధర్మసాగర్ ఎస్సీకాలనీ పల్లెబండ వద్ద నిల్వచేసి తరలిస్తున్న మట్టి

అక్రమంగా మట్టి దందా

- ప్రభుత్వ భూములే లక్ష్యంగా కొనసాగిస్తున్న వ్యాపారులు
- ఫిర్యాదు చేసినా పట్టించుకోని అధికారులు
- చర్యలు తీసుకోవాలంటున్న ఆయా గ్రామాల ప్రజలు

ధర్మసాగర్, జనవరి 1 : పచ్చని పంటలు పండే భూముల్లో నుంచి అక్రమంగా మట్టిని తరలించడంతో వ్యవసాయ భూములు పనికి రాకుండా పోతున్నాయి. ధర్మసాగర్ మండలం ముప్పారం, నర్సింగరావుపల్లి, నారాయణగిరి, ఎలుకుర్తి గ్రామాలలోని ప్రభుత్వ భూముల్లో నుంచి వ్యాపారులు రాత్రి పది గంటల నుంచి తెల్లవారి ఐదు గంటల వరకు మట్టిని నిరంతరం తరలిస్తున్నారు. పోలీసుస్టేషన్‌కు, తహసీల్దార్ కార్యాలయానికి కూత వేటు దూరంలో ఉన్న ధర్మసాగర్ పెట్రోల్ బంక్ వద్ద నిత్యం ఎక్స్‌వేటర్స్, టిప్పర్లు ప్రతీ రోజు నిలిపి వేస్తూ రాత్రి వేళలో మట్టి రవాణా చేస్తున్నారు. ప్రభుత్వం రైతుల ఉపాధి కోసం పంపిణీ చేసిన భూముల్లో పది నుంచి పదిహేను ఫీట్ల లోతు వరకు మట్టిని తీసి తరలించడంతో భూములు వ్యవసాయానికి పనికి రాకుండా పోతున్నాయి. ఇటీవల ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నప్పటికీ వారి దందా మాత్రం నిలిపి వేసిన నాధుడే లేడు. ధర్మసాగర్ మండలం ఎలుకుర్తి, ముప్పారం, నారాయణగిరి, రాపాకపల్లి, ధర్మసాగర్, దేవునూర్, శాయిపేట్, మల్లక్‌పల్లి తదితర గ్రామాలలో మట్టి వ్యాపారం చేసే వ్యాపారులు పోలీసులను, రెవెన్యూ అధికారులను, మైనింగ్, విజిలెన్స్ అధికారులను ప్రతి నెల వ్యాపారులు ప్రసన్నం చేసుకోవడం వల్లనే ఇష్టానుసారంగా మట్టిని తరలిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. మట్టి రవాణాను నిలిపి వేయాలని పలుమార్లు అయా గ్రామాల ప్రజలు పోలీసులకు డయల్ 100కు సమాచారం అందించినా చర్యలు తీసుకున్న వారే లేరని పలువురు వాపోతున్నారు. రాత్రి వేళలో ధర్మసాగర్ పీఎస్‌కు అతి సమీపాన బ్రిక్స్ తయారీ కేంద్రం, ఎస్సీ కాలనీ పల్లెబండ, ఎలుకుర్తికి వెళ్లే దారి వద్ద, ఎలుకుర్తి కోళ్లఫామ్‌ల వద్ద మూడు చోట్ల, కరుణాపురం రింగ్ రోడ్డు బ్రిడ్జి ఎడమ వైపు రెండు చోట్ల రాత్రి వేళల్లో మట్టిని నంబర్లు లేని టిప్పర్ల సాయంతో తరలించి నిల్వ చేస్తున్నారు. అక్కడి నుంచి నగరానికి, వెంచర్లకు ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు. ధర్మసాగర్ మండలంలో మట్టి రవాణాను నిలిపి వేసి వ్యవసాయ భూములను కాపాడాలని మండల ప్రజలు కోరుతున్నారు.



ప్రభుత్వం పంపిణీ చేసిన ఎలుకుర్తి భూముల్లో నుంచి మట్టి తీసిన దృశ్యం

సైనికులు చట్టసభల్లో ఉండొద్దా?

- పార్టీలు ఆత్మపరిశీలన చేసుకోవాలి
- కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ హైకమాండ్లకు రిటైర్డ్ కల్నల్ లేఖ



రిటైర్డ్ కల్నల్ డాక్టర్ భిక్షపతి

జనగామ టౌన్, జనవరి 1: 'దేశ రక్షణలో ప్రాణాలను సైతం లెక్క చేయకుండా పనిచేస్తున్న సైనికులు రాజకీయాలకు పనికిరారా..? విపత్కర పరిస్థితుల్లోనూ నిబ్బరం కోల్పోకుండా దేశ రక్షణకు పనిచేసే సైనికులకు చట్టసభల్లో అవకాశాలు కల్పిస్తే అద్భుతాలు సృష్టించగలరు.. పదవీ విరమణ పొందిన సైనికుల జ్ఞానం, అనుభవం ఇప్పుడున్న రాజకీయాలకు ఎంతో అవసరం.. వారికి చట్టసభల్లో ప్రాధాన్యం ఇచ్చే విషయంలో అన్ని పార్టీలు ఆత్మపరిశీలన చేసుకోవాలి..' అంటూ ఎక్స్ సర్వీస్‌మెన్ ఫెడరేషన్ రాష్ట్ర చైర్మన్, రిటైర్డ్ కల్నల్ డాక్టర్ మాచర్ల భిక్షపతి భావోద్వేగ లేఖ రాశారు. పదవీ విరమణ పొందిన సైనికుల తరుపున సోమవారం ఆయన బీజేపీ, కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీ అధిష్టానాలకు ఓ లేఖ రాశారు. పొరుగు దేశాల నుంచి ఎలాంటి ముప్పు లేకుండా సైనికులు ఎంతో కృషి చేస్తున్నారన్నారు. దేశ రక్షణ కోసం సియాచిన్, ద్రాస్, కార్గిల్ వంటి యుద్ధాల్లో పోరాడిన సైనికులు కేవలం ఉద్యోగాలకు మాత్రమే పరిమితమవుతున్నారని, వారికి చట్టసభల్లో అవకాశాలు కల్పిస్తే అవినీతి రహిత పాలన అందిస్తారని అభిప్రాయపడ్డారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో తమకు ప్రాధాన్యం ఇవ్వాలని మాజీ సైనికుల సమాఖ్య తరపున విజ్ఞప్తి చేస్తే ఎవరూ పట్టించుకోలేదని, త్వరలో జరుగబోయే పార్లమెంట్ ఎన్నికల్లోనైనా జవాన్లకు పోటీ చేసే అవకాశాలను పార్టీ అధిష్టానాలు కల్పించాలని భిక్షపతి కోరారు.

ఆధార్ అప్‌డేషన్‌కు పరుగులు

● ఆరు గ్యారంటీలకు ఆధార్‌కార్డు తప్పనిసరి ● పడిగాపులు కాస్తున్న ప్రజలు ● కిటకిటలాడుతున్న జిరాక్స్ సెంటర్లు

హనుమకొండ రూరల్, జనవరి 1 : కొత్తగా కొలువు దీరిన కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల హామీలను అమలు చేసేందుకు సిద్ధమైంది. ప్రభుత్వ పథకాలు పొందేందుకు ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు తప్పనిసరి కావడంతో ఆధార్ సెంటర్ల వైపు ప్రజలు పరుగులు పెడుతున్నారు. ఆధార్ కార్డులో వయస్సు, చిరునామా తదితర మార్పులు చేయించుకుంటున్నారు. అయితే ఆధార్ తీసుకొని పది సంవత్సరాలు పూర్తయిన వారు తప్పనిసరిగా అప్‌డేషన్ చేసుకోవాలని ఇప్పటికే కేంద్ర ప్రభుత్వం సూచించిన విషయం తెలిసిందే. అందుకు గడువు కూడా రెండుసార్లు పొడిగించింది. అయినా చాలా మంది అప్‌డేట్ చేయించుకోలేదు. ఆధార్ కార్డుపై ఆంధ్రప్రదేశ్ అని ముద్రించి ఉన్నా ప్రభుత్వ పథకాలకు దరఖాస్తు చేసుకోవచ్చని అధికారులు చెబుతున్నా ప్రజలు అప్‌డేషన్ కోసం ఆధార్‌సెంటర్లకు వెళుతున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆరు గ్యారంటీ పథకాలకు దరఖాస్తు చేయాలంటే ఆధార్ అవసరం కావడంతో మీ సేవా కేంద్రాలు, ఆధార్ సెంటర్ల వైపు జనం పరుగులు పెడుతున్నారు.

సంక్షేమ పథకాలకు తప్పనిసరి

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే వివిధ సంక్షేమ పథకాలు పొందాలంటే సంబంధిత లబ్ధిదారుల ఆధార్ నెంబరు అనుసంధానం తప్పనిసరి. ఈ క్రమంలో సంబంధిత ఆధార్‌కార్డుల్లో వివరాలు సరిగా ఉన్నాయా లేదా అని అధికారులు పరిశీలిస్తున్నారు. పది సంవత్సరాల క్రితం జారి చేసిన ఆధార్‌కార్డుల్లో సరైన వివరాలు లేకపోవడం, ఫొటో, మొబైల్ నెంబరు, చిరునామా తదితర వివరాలు సక్రమంగా నమోదు కాకపోవడంతో ఇతరత్రా కారణాలతో కార్డులు రిజెక్టు అవుతున్నాయి. దీంతో పింఛన్లు, రేషన్‌కార్డులు, విద్యా సంస్థల్లో ప్రవేశాలకు, బ్యాంకు ఖాతాలు, కల్యాణలక్ష్మీ, రైతుబంధు, రైతుబీమా లాంటి అనేక సంక్షేమ పథకాలకు అర్హులైన వారు వాటికి దూరం కావాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. ఆధార్‌కార్డును సరిచేసుకునేందుకు ప్రజలు ఆధార్ కేంద్రాల చుట్టు తిరుగుతున్నారు.





కేయూ జంక్షన్‌లోని ఆధార్ కేంద్రంలో బారులుదీరిన ప్రజలు, హనుమకొండ డీఈవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఆధార్ కేంద్రంలో ప్రజలు

అన్నిటికి ఆధార్‌కార్డే ఆధారం

ప్రభుత్వ, ప్రయివేట్ శాఖల్లో ఏ చిన్న పని జరగాలన్నా ఆధార్‌కార్డును ప్రమాణికంగా తీసుకోవవడంతో ఆధార్ కీలకంగా మారింది. ఆధార్ కార్డుల జారిని కేంద్ర ప్రభుత్వం 2010 సంవత్సరంలో తీసుకురాగా, ఆధార్‌కార్డుల అప్‌డేట్ చేసుకునేందుకు అవకాశం కల్పించింది. ఈ సేవలు వినియోగించుకోవడానికి మారుమూల గ్రామాల ప్రజలు అనేక ఇబ్బందులు పడాల్సి వస్తోంది. దీనికి తోడు నూతనంగా ఆధార్ తీసుకునేందుకు ప్రజలు నానా ప్రయాసలు ఎదుర్కొంటున్నారు. మండలానికో ఆధార్ కేంద్రం ఏర్పాటు చేయాల్సి ఉన్నప్పటికీ లేకపోవడంతో పట్టణ ప్రాంతాలకు వెళ్లాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. మండల కేంద్రాల్లో మీ సేవా కేంద్రాలు, బ్యాంకులలో ఆధార్ సేవలు ఉన్నప్పటికీ వివిధ అవసరాల నిమిత్తం ప్రజలు ఎక్కువ సంఖ్యలో వస్తుండటంతో ఆధార్ సేవలను పట్టించుకోవడం లేదనే విమర్శలు వస్తున్నాయి. నూతనంగా ఆధార్‌కార్డులు పొందడం, మార్పులు, చేర్పులు చేసుకునేందుకు వ్యయప్రసాల కోర్చి ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇతర ప్రాంతాలకు వెళ్లినా ఆధార్ కేంద్రాల్లో జనం ఎక్కువ సంఖ్యలో ఉండటంతో వెనుదిరగాల్సి వస్తోంది.

ప్రతీ పదేళ్లకోసారి అప్‌డేట్ చేసుకోవాలి

2016 సంవత్సరానికంటే ముందు ఆధార్‌కార్డు పొందిన ప్రతీ ఒక్కరూ తగిన గుర్తింపు పత్రాలతో ఆధార్ అప్‌డేట్ చేసుకోవాల్సి ఉంటుంది. నెలల వయసు చిన్నారుల నుంచి 5 సంవత్సరాలలోపు చిన్నారుల వరకు విధిగా ఆధార్ నమోదు చేయించాలి. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందించే అన్ని రకాల సరుకులకు ఆధార్ అనుసంధానం తప్పనిసరి చేయడంతో చిన్నారుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. 2010 నుంచి 2018 సంవత్సరాల మధ్య జారి అయిన ఆధార్‌కార్డు నమోదుదారుల తోపాటు తండ్రి, భర్త విషయాలే ముద్రితమయ్యాయి. 2018 తర్వాత వాటి స్థానంలో చిరునామా మాత్రమే పేర్కొంటూ కార్డులను జారీ చేశారు. ఆధార్‌కార్డుల జారీ ప్రారంభంలో ఎలాంటి వివరాలు నమోదు చేయలేదు. ఎలాంటి వివరాలు ఆధార్‌లో లేకపోవడంతో అనేక సమస్యలు ఉత్పన్నమయ్యేవి. ప్రస్తుతం ఆ వివరాలకు సంబంధించిన ధృవీకరణపత్రాలు పొందుపరుస్తూ పూర్తి వివరాలతో ఆధార్‌కార్డులను అప్‌డేట్ చేయించుకుంటే భవిష్యత్‌లో ఎలాంటి ఇబ్బందులు తలెత్తవు.

కిటకిటలాడుతున్న జిరాక్స్ సెంటర్లు

ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆరు గ్యారంటీలకు దరఖాస్తు చేసుకోవడానికి ప్రజలు పెద్ద ఎత్తున ప్రజాపాలన గ్రామ, వార్డు సభలకు తరలి వస్తున్నారు. దరఖాస్తు ఫారాల కొనుగోలు, వాటికి జత చేయాల్సిన ఆధార్‌కార్డు, రేషన్‌కార్డులతోపాటు ఇతర ధృవీకరణ పత్రాల కోసం వచ్చిన ప్రజలతో జిరాక్స్ సెంటర్లు కిటకిటలాడుతున్నాయి. ఈ క్రమంలో కొన్ని ప్రాంతాల్లో ప్రజాపాలన దరఖాస్తులను అధిక ధరలకు విక్రయిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.



మల్లన్న ఆలయ గంగిరేగుచెట్టు ఆవరణలో భక్తజనసందోహం

కొమురవెల్లి మల్లన్న మూలవిరాట్టు దర్శనం నిలిపివేత

చేర్యాల, జనవరి 1 : సిద్దిపేట జిల్లాలోని కొమురవెల్లి ఆలయంలో మల్లన్న కల్యాణం సందర్భంగా మూలవిరాట్టు దర్శనాన్ని సోమవారం సాయంత్రం నిలిపివేశారు. మూలవిరాట్టును సుందరీకరించనున్నందున గర్భాలయ ప్రవేశం, దర్శనాన్ని ఆపేశారు. భక్తుల కోసం ఉత్సవ విగ్రహాలను నెలకొల్పారు. ఈనెల 7న తెల్లవారుజామున దృష్టికుంభం నిర్వహించిన అనంతరం మూలవిరాట్టు దర్శనం ప్రారంభించనున్నారు. కొమురవెల్లి మల్లికార్జునస్వామి దేవాలయం సోమవారం భక్తులతో రద్దీగా మారింది. నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని పొరుగు ప్రాంతాలకు చెందిన వందలాదిమంది భక్తులు తరలివచ్చారు. భక్తుల రద్దీ దృష్ట్యా ప్రసాద విక్రయశాల వద్ద మహిళలు తీవ్ర ఇబ్బందులుపడ్డారు. పురుషులు, స్త్రీలకు ప్ర త్యేకంగా కౌంటర్లు ఏర్పాటుచేయకపోవడంతో ఒకే క్యూలైన్‌లో నిలబడి తోపులాటతో తంటాలుపడ్డారు.

మల్లన్న స్వామికి మొక్కులు చెల్లించిన 'కడియం'



స్వామి వారిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే కడియం శ్రీహరి దంపతులు

ఐనవోలు, డిసెంబరు 1: స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి దంపతులు ఐనవోలు మల్లికార్జునస్వామిని సోమవారం దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధించడంతోపాటు నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని సోమవారం కుటుంబసమేతంగా ఆలయాన్ని సందర్శించారు. ఆలయ సంప్రదాయం ప్రకారం అర్చకులు పూర్ణకుంభంతో ఎమ్మెల్యేకు స్వాగతం పలికి వేద ఆశీర్వచనాలతో పాటు పట్టువస్త్రాలు తీర్థప్రసాదాలు అందజేశారు. డీసీసీబీ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు, ఎంపీపీ మార్నేని మధుమతి, జడ్పీ వైస్‌చైర్మన్ గజ్జెలి శ్రీరాములు, స్థానిక సర్పంచ్ జన్ను కుమారస్వామి, జఫర్‌గడ్ సొసైటీ చైర్మన్ కరుణాకర్ రావు, గర్మిళ్లపల్లి సర్పంచ్ గండి మల్లికాంబరమేష్, ఎంపీటీసీ కడూదురి రాజు, సొసైటీ వైస్ చైర్మన్ చందర్‌రావు, ఉప సర్పంచ్ అడ్డగూడి సతీష్, మాజీ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు నాయకులు మునిగాల సంపత్‌కుమార్, వడిచర్ల శ్రీనివాస్, బుర్ర రాజశేఖర్, ఆడేపు దయాకర్, పెండ్లి తిరుపతి, పల్లకొండ సురేష్, తండ వెంకన్న, విజయభాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

హక్కుల కోసం గిరిజనేతరుల రిలే దీక్ష



బయ్యారంలో రిలే దీక్ష చేస్తున్న గిరిజనేతరులు

బయ్యారం, జనవరి 1: షెడ్యూల్డ్ ఏరియాలోని ఏజెన్సీ ప్రాంతంలో నివసించే గిరిజనేతరులు హక్కుల కోసం బయ్యారంలో సోమవారం రిలే నిరాహార దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతంలో నివసించే ఎస్సీ, బీసీ, ఓసీ, మైనారిటీ కులాలకు చెందిన వారు పలు రకాల ఇబ్బందులకు గురవుతూ ఆర్థికంగా తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. తాతముత్తాతల నాటి నుంచి ఈ ప్రాంతంలో నివసిస్తూ ఓటు హక్కు కలిగి ఉన్నప్పటికి సాగు భూములపై హక్కులు లేకపోవడంతో పాటు విద్యార్థులు, నిరుద్యోగులకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు రాక తీవ్రంగా నష్టపోవాల్సి వస్తుందన్నారు. ఇకనైన ఏజెన్సీ ప్రాంతంలోని గిరిజనేతరుల ఇబ్బందులు తొలిగిపోవాలంటే రాజకీయ పార్టీల నాయకులతో పాటు ప్రజా, కుల సంఘాల నేతలు, యువత మద్దతు తెలపాలని అన్నారు. రాబోయే స్థానిక ఎన్నికల్లో రూల్ ఆఫ్ రిజర్వేషన్ అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో బీసీ జనసభ జిల్లా నాయకుడు చల్లా గోవర్ధన్, బీసీ జిల్లా నాయకులు చీరాల జలేందర్, మందాటి శ్రీనివాస్, నూనె యాకయ్య, నూనె బసవయ్య, వెంకటమల్లు, సుధాకర్, లక్ష్మయ్య, బుచ్చయ్య, అఖిల్, మురళి, సంతోష్, లింగయ్య, నరేష్ పాల్గొన్నారు.

లౌకికవాద రాజ్య స్థాపనకై పోరాడుదాం

» ఎన్డీ రాష్ట్ర సహాయ కార్యదర్శి సాధినేని వెంకటేశ్వరరావు



మాట్లాడుతున్న ఎన్డీ రాష్ట్ర సహాయ కార్యదర్శి సాధినేని వెంకటేశ్వరరావు

మహబూబాబాద్ రూరల్, జనవరి 1: దేశంలో కులం, మత రహిత, తాడిత, పీడిత ప్రజా సమస్యలపై పోరాడి సాధించడమే అమరులకు మనమిచ్చే నిజమైన నివాళులని సీపీఐ(ఎంఎల్) న్యూ డెమోక్రసీ రాష్ట్ర సహాయ కార్యదర్శి సాధినేని వెంకటేశ్వరరావు అన్నారు. మహబూబాబాద్ మండలం కంబాలపల్లి గ్రామంలో సోమవారం ఎన్డీ సీనియర్ నాయకుడు, మాజీ సర్పంచ్ సంద వెంకన్న సంతాప సభలో పాల్గొని మాట్లాడారు. దేశంలో కులం, మతం పేరుతో పాలకులు ప్రజల మధ్య విద్వేషాలు సృష్టిస్తూ ప్రజా సమస్యలను పక్కదారి పట్టించేలా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. ఈ తరుణంలో విప్లవ శక్తులు ఏకమై కులమత రహిత తాడిత, పీడిత ప్రజల సమస్యలపై పోరాడి హక్కులను సాధించి పెట్టడమే అమరులకు మనం అర్పించే నిజమైన నివాళులన్నారు. వెంకన్న సేవలు చిరస్మరణీయమని ఆయన కొనియాడారు. కార్యక్రమంలో ఎన్డీ జిల్లా కార్యదర్శి గౌని ఐలయ్య, గుజ్జు దేవేందర్, మైన శ్రీనివాస్, ఎన్డీ రాష్ట్ర నాయకులు మండల వెంకన్న, జడ సీతారామయ్య శివ్వారపు శ్రీధర్, శ్రీశైలం, బాబన్న, తాజ్‌పాషా, బట్టు చైతన్య, బోనగిరి మధు, పద్మ, సోమిరెడ్డి పాల్గొన్నారు.

సంస్థలను ధ్వంసం చేస్తున్న కేంద్రం : సీపీఐ



కంతాయపాలెం గ్రామంలో మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి సాదుల శ్రీనివాస్

తొర్రూరు రూరల్, జనవరి 1 : రాజ్యాంగ సంస్థలను ధ్వంసం చేస్తున్న బీజేపీకి తగిన బుద్ధి చెప్పాలని సీపీఐ జిల్లా కార్యదర్శి సాదుల శ్రీనివాస్ అన్నారు. తొర్రూరు మండలం కంతాయపాలెంలో గ్రామ శాఖ కార్యదర్శి మార్క సాంబయ్య అధ్యక్షతన సోమవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశ సమైక్యత, సమగ్రతను కాపాడటమే తమ ధ్యేయమని అన్నారు. కేంద్రంలో బీజేపీ మతం ప్రాతిపదికన దేశాన్ని పాలించాలని చూస్తుందని, లౌకిక ప్రజాస్వామ్యం నాటకమని తెలిపారు. దేశంలో ప్రజా సమస్యలు గాలికొదిలేసి రాముడి జపం చేస్తున్నారని ఆరోపించారు. ప్రతీ ఒక్కరు మతోన్మాద, ఫాసిస్టు విధానాలకు వ్యతిరేకంగా పోరాడాలని శ్రీనివాస్ పిలుపు నిచ్చారు. సమావేశంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు బొల్లం అశోక్, మండల కార్యదర్శి యాకూబ్, సోమిరెడ్డి, దర్గయ్య, సాయిమల్లు, ఉపసర్పంచ్ రాంమూర్తి, శంకర్, ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

బ్యాట్మింటన్ పోటీలకు కేయూ జట్టు ఎంపిక



ఎంపికైన జట్టుతో కేయూ స్పోర్ట్స్ బోర్డు సెక్రటరీ శ్రీనివాసరావు

కేయూ క్యాంపస్, జనవరి 1 : కర్ణాటక రాష్ట్రంలోని బెళగావి వీటీ యూనివర్సిటీలో జనవరి 2 నుంచి 5 వరకు నిర్వహించనున్న సౌత్ వెస్ట్ జోన్ ఇంటర్ యూనివర్సిటీ టోర్నమెంట్‌కు ఉమెన్స్ బ్యాట్మింటన్ కాకతీయ యూనివర్సిటీ జట్టును ఎంపిక చేసి ప్రకటించినట్లు కేయూ స్పోర్ట్స్ బోర్డు సెక్రటరీ ప్రొఫెసర్ పెద్దమళ్ల శ్రీనివాసరావు సోమవారం ప్రకటించారు. 2023-24 సంవత్సరానికిగాను కాకతీయ యూనివర్సిటీ నుంచి జట్టు పాల్గొంటుందని వెల్లడించారు. ఎంపికైన వారిలో ఎస్.వర్షిత, వి.తనూశ్రీ, పి.లక్ష్మి (కిట్స్ కళాశాల, హసన్‌పర్తి, వరంగల్) జి.కీర్తన, ఎం.పూజరాగప్రియ (కేయూ ఇంజనీరింగ్ కళాశాల, హనుమకొండ)లు ఎంపికైనట్లు స్పోర్ట్స్ బోర్డు సెక్రటరీ ప్రొఫెసర్ పి.శ్రీనివాసరావు వెల్లడించారు. జట్టుకు కొత్తగూడెంలోని సింగరేణి డిగ్రీ కళాశాల ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ కె.సావిత్రి మేనేజర్‌గా వ్యవహరిస్తారు. జట్టును కేయూ వీసీ ప్రొఫెసర్ తాటికొండ రమేశ్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ టి.శ్రీనివాసరావులు అభినందించారు.

ప్రమాదకరంగా ట్రాన్స్‌ఫార్మర్

వర్ధన్నపేట, జనవరి 1: ఇళ్ల మధ్యలో ప్రమాదకరంగా ట్రాన్స్‌ఫార్మర్ ఉండటంతో, ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. వర్ధన్నపేట పట్టణ కేంద్రంలోని రెండవ వార్డు పరిధిలో ఉన్న రాజస్థాన్ వీధిలో ఎలాంటి రక్షణ లేకుండా ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేశారు. ఫెన్సింగ్ ఏర్పాటు చేయాల్సిన విద్యుత్ అధికారులు తమకేమి పట్టనట్లుగా ఎలాంటి చర్యలు తీసుకోలేదు. దీనికితోడు ట్రాన్స్ ఫార్మర్ పిచ్చిమొక్కలు ఏపుగాపెరిగి ప్రమాదరంగా మారాయి. గతంలో ఇదే కాలనీకి చెందిన ఓ బాలుడు ట్రాన్స్‌ఫార్మార్ షాక్‌కు గురై గాయాల పాలు అయ్యాడు. ప్రాణాపాయం తప్పినప్పటికీ నివాస ప్రాంతంలో ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాడు చేయడం స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. విద్యుత్ అధికారులు ఇప్పటికైనా స్పందించి ట్రాన్స్‌ఫార్మర్‌ను ఇక్కడి నుంచి తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.



ఇళ్ల మధ్యలో ప్రమాదకరంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్

మళ్లీ యువత ఓటరు నమోదు ప్రారంభం

» మార్పులు, చేర్పులకు అవకాశం
» ఓటరు జాబితా సవరణకు ఆదేశాలు

వరంగల్ కలెక్టరేట్, జనవరి 1: యువత 18 సంవత్సరాలు నిండి జనవరి 1 నుంచి ఓటరు జాబితాలో నమోదు చేసుకోవడానికి కేంద్ర ఎన్నికల సంఘం యువత ఓటరు నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించింది. జనవరి 1 నుంచి ఆన్‌లైన్ ద్వారా, బూత్ లేవల్ స్థాయి అధికారుల వద్ద నమోదు చేసుకోవచ్చు. నూతన ఓటరు నమోదు కార్యక్రమంపై కేంద్ర ఎన్నికల సంఘం ముసాయిదా జాబితాను ఈనెల 6న ప్రకటించనుంది. ఓటర్లు తమ ఓటరు ఐడీ కార్డుల్లో మార్పులు, చేర్పులు తప్పులు ఉంటే సరిచేసుకోవడానికి ఫాం-6, ఫాం-8 ద్వారా దరఖాస్తు చేసుకోవడానికి అవకాశం ఉంది. దరఖాస్తు చేసుకున్న వాటిని బూత్ లెవల్ స్థాయి అధికారులు పరిశీలించి అధికారులకు అందజేస్తారు. జనవరి 6న ముసాయిదాను ప్రకటించి అభ్యంతరాలు స్వీకరిస్తారు.



ఫిబ్రవరి 8న తుది జాబితా..

అసెంబ్లీ ఎన్నికలు ముగిసిన అనంతరం వచ్చే పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో 18 సంవత్సరాలు నిండిన యువతకు కేంద్ర ఎన్నికల సంఘం ఓటు హక్కు కల్పించడానికి ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించనుంది. అలాగే ఓటరు ఐడీ కార్డులో మార్పులు, చేర్పులు చేసుకోవడానికి కూడా అవకాశం కల్పించింది. తప్పులు ముద్రణ జరిగినచో సరిచేసుకోవడానికి కూడా అవకాశం కల్పించారు. జనవరి 6న ముసాయిదా జాబితాను ప్రకటించి జనవరి 22 వరకు ఏమైనా అభ్యంతరాలు ఉంటే స్వీకరించనున్నారు. ఫిబ్రవరి 8న తుది ఓటరు జాబితాను ప్రకటించే అవకాశం ఉంది.

ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలి..

నగరంతో పాటు జిల్లాలోని గ్రామాల్లో ఓటరు నమోదు కార్యక్రమాన్ని ఒక ప్రత్యేక కార్యాచరణగా రూపొందించాల్సిన అవసరం ఉంది. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో జరుగనున్న ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకోవడానికి అర్హులైన వారందరికీ ఓటు హక్కు కల్పించి 18 సంవత్సరాల యువతకు ఓటు హక్కు కల్పించడానికి ఇంటింటా సర్వే ద్వారా కళాశాలల్లో వివరాలను సేకరించి ఓటరు నమోదు అవకాశం చేపట్టాలి. గతంలో ఓటరుగా ఉన్న చాలా మందికి ఓటరు ఐడీ కార్డులు పోస్టు ద్వారా పంపినట్లు అధికారులు తెలిపినా చాలా మందికి పోస్టల్ ద్వారా రాలేదు. చాలా సంవత్సరాల క్రితం నుంచి ఓటరు ఐడీ కార్డు ఉన్నవారికి కూడా ప్రస్తుతం ఉన్న ఫొటోతో ఐడీ కార్డు జారీ చేసేలా మీ సేవ కార్యాలయాల్లో అవకాశాలు కల్పించాలని కోరుతున్నారు.

ఓటరు నమోదు కోసం ఇంటింటికి..



జనవరి 1 నాటికి 18 సంవత్సరాలు నిండిన వారు నూతనంగా ఓటరు జాబితాలో తమ పేరు నమోదు చేసుకోవడానికి ఓటు హక్కు కోసం యువత దరఖాస్తు చేసుకోవాలి. ఎన్నికల సంఘం యువతకు ఓటు హక్కు కల్పించడానికి డిసెంబరు 20 నుంచే జిల్లాలోని గ్రామాల్లో, నగరంలోని డివిజన్లలో బూత్ లెవల్ సిబ్బంది ఇంటింటికి తిరుగుతూ అర్హుల నుంచి దరఖాస్తులను స్వీకరించే కార్యక్రమాన్ని చేపట్టారు. కొత్తగా యువత ఓటు హక్కు కోసం ఫాం -6 ద్వారా నమోదు చేసుకోవాలి.

వావ్.. కొబ్బరిపువ్వు



పోషకాలమెండుతో పెరిగిన అమ్మకాలు

» నగరంలో ప్రధాన కూడళ్లలో విక్రయాలు
» కేరళ, తమిళనాడు రాష్ట్రాల నుంచి దిగమతి

కరీమాబాద్, జనవరి 1: ప్రకృతి అందించే ఫలాలు మానవాళికి ఎంతో మేలు చేస్తుంటాయి. ఒక్కో పండు ఒక్కో ప్రత్యేకతను చాటుతూ ఆరోగ్య దాయనిగా పేరుపొందాయి. అలాంటిదే కొబ్బరిపువ్వు. కొబ్బరికాయలో లోపల తెల్లని ముద్దగా ఉండేదే ఈ కొబ్బరిపువ్వు. కొబ్బరి పువ్వు దర్శనమిస్తే మంచి జరుగుతుందని ఎంతో మంది నమ్ముతారు. కాని ఇప్పుడు అదే కొబ్బరిపువ్వును తింటే ఆరోగ్యానికి మహాభాగ్యం అంటున్నారు. వాస్తవానికి కొబ్బరికాయలో నీరు ఇంకిపోయి కొబ్బరి ముదిరినప్పుడు పువ్వు ఏర్పడుతుంది. కొబ్బరినీళ్లు, కొబ్బరిలో లభించే పోషకాల కంటే ఈ పువ్వులోనే అధిక పోషకాలు లభిస్తాయని నిపుణులు అంటున్నారు.

నగరంలో అమ్మకాలు జోరు..

కొబ్బరి పువ్వు విక్రయాలు నగరంలో జోరందుకుంది. ప్రధాన కూడళ్లలో కొబ్బరిపువ్వు కౌంటర్లు ఏర్పాటు చేసి మరీ విక్రయిస్తున్నారు. ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుండడంతో నగరవాసులు వాటిని ఎగబడి కొనుగోలు చేస్తున్నారు. భద్రకాళి దేవాలయ కమాన్, కేఎంసీ ముందు, ములుగురోడ్, ఓ సిటీ, ఖమ్మం రోడ్, లేబర్‌కాలనీ, కాశిబుగ్గ జంక్షన్, పలుప్రాంతాల్లో ఈ కొబ్బరి పువ్వు అమ్మకాలు సాగుతున్నాయి. వీటి ధర ఒక్కో కొబ్బరిపువ్వు సైజును బట్టి రూ. 60 నుంచి రూ.80 వరకు లభిస్తున్నాయి.



కేసీఎం సమీపంలో కొబ్బరిపువ్వు కొనుగోలు చేస్తున్న యువకులు

కేరళ, తమిళనాడు రాష్ట్రాల నుంచి దిగుమతి...

నగరంలో లభిస్తున్న ఈ కొబ్బరిపువ్వు కేరళ రాష్ట్రంలోని మున్నార్, ఆలిప్పి, కొట్టాయం, తిరువనంతపురం, తమిళనాడులోని కోయంబత్తూర్, ధర్మపురి తదితర ప్రాంతాల నుంచి దిగుమతి అవుతున్నాయి.

ప్రయోజనాలు ఇలా..

- రక్తంలో చెక్కర స్థాయిలను అదుపుచేయడంలో ఇన్సులెన్ స్రావాన్ని ప్రేరేపించడంలో సహాయపడుతుంది.
- క్యాలరీలు తక్కువగా ఫైబర్ పీచు పదార్థాలు అధికంగా ఉండటంతో బరువు తగ్గేందుకు సహకరిస్తుంది.
- శరీరంలో రోగనిరోధక శక్తి పెరుగుతుంది.
- అలసట, నీరసం వంటి సమస్యల్ని దూరం చేస్తుంది.
- కిడ్నీ ఇన్‌ఫెక్షన్స్, కిడ్నీ డ్యామేజ్ వంటి జబ్బులను నివారిస్తుంది.
- ఆంటి ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉండడంతో క్యాన్సర్ కారకాలను దరిచేరనీయదు.
- శరీరంలో హార్మోన్‌లెవల్స్‌ని సరిస్థాయిలో ఉంచుతుంది
- చెడు కొవ్వును తగ్గిస్తుంది.
- బీపీ, షుగర్, థైరాయిడ్, వ్యాధులను క్రమబద్ధీకరిస్తుంది
- జుట్టుకు కావాల్సిన పోషకాలను అందిస్తుంది.
- విటమిన్ ఈ, సీ పుష్కలంగా లభ్యం అవుతాయి
- గుండెపోటును నివారిస్తుంది.

టేస్ట్ చేద్దామని కొనుగోలు చేశాం

- ఇటుకాల సాంబయ్య, వరంగల్



నగరంలో చాలా చోట్ల ఈ కొబ్బరిపువ్వు అమ్మకాలు చేస్తున్నారు. ఒకసారి టేస్ట్ చేద్దామని కొనుగోలు చేసి తిన్నాం. చాలా రుచిగా ఉంది. ఆరోగ్యానికి కూడా చాలా మంచదని తెలిసింది. పిల్లలు కూడా ఇష్టంగా తింటున్నారు.

అమ్మకాలు పెరిగాయి....

వెల్ది లావణ్య సతీష్, కొబ్బరిపువ్వు విక్రయదారు



రెండు నెలలుగా కొబ్బరిపువ్వు అమ్మకాలు చేస్తున్నాం. ఇప్పుడు ప్రజలు ఈ కొబ్బరిపువ్వు కొనుగోలుకు ఆసక్తి కనబస్తున్నారు. అమ్మకాలు జోరందుకున్నాయి. గతంతో పోలిస్తే ఇప్పుడు వ్యాపారం బాగుంది.

ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలి : మాజీ ఎమ్మెల్యే



మాజీ ఎమ్మెల్యే రెడ్యాకు శుభాకాంక్షలు తెలుపుతున్న బీఆర్ఎస్ నాయకులు

చిన్నగూడూరు, జనవరి 1 : నూతన సంవత్సరంలో ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని మాజీ ఎమ్మెల్యే రెడ్యానాయక్ ఆకాంక్షించారు. మండలంలోని ఉగ్గంపల్లిలో గల స్వగృహంలో సోమవారం డోర్నకల్ నియోజకవర్గ బీఆర్ఎస్ నాయకులు ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి నూతనసంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మరిపెడ మాజీ కో-ఆప్షన్ ఎండీ.అయూబ్ పాషాకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. శుభాకాంక్షలు తెలిపిన వారిలో నవీన్‌రావు, అరుణ, సింధు, ఎంపీటీసీ ఉదయమ్మ కొమురెల్లి, సర్పంచ్ పూలమ్మమల్లేశం, అలీం, రమేష్, యాకి, కాలునాయక్ ఉన్నారు.

ఘనంగా విద్యార్థినుల జన్మదిన వేడుకలు



విద్యార్థినుల జన్మదిన వేడుకల్లో కేక్ కట్ చేస్తున్న హాస్టల్ వెల్ఫేర్ అధికారి పద్మ

కురవి, జనవరి 1 : కురవి మండల కేంద్రంలోని గిరిజన బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలలో విద్యనభ్యసిస్తున్న విద్యార్థినులలో 21 మంది జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. 1 జనవరి, 2024 నూతన సంవత్సరం రోజున 21 మంది విద్యార్థినుల జన్మదినం తెలుసుకున్న హాస్టల్ వెల్ఫేర్ అధికారి(హెచ్‌డబ్ల్యూవో) పద్మ సోమవారం విద్యార్థినులచే కేక్ కట్ చేయించి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పద్మ మాట్లాడుతూ నూతన సంవత్సరం రోజునే మా హాస్టల్‌లో ఉంటున్న విద్యార్థినుల పుట్టిన రోజు కావడం ఆనందంగా ఉందని తెలిపారు. వారి సంతోషమే తన సంతోషంగా భావించి పుట్టిన రోజు వేడుకలు నిర్వహించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయుడు అనిల్‌కుమార్, ఏఎన్ఎం నాగమణి తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఎంపీపీ అనుమాండ్ల రామనర్సమ్మ మృతి



రామనర్సమ్మ (ఫైల్)

నెల్లికుదురు, జనవరి 1 : నెల్లికుదురు మండల తొలి మాజీ ఎంపీపీ, రామన్నగూడెం గ్రామానికి చెందిన అనుమాండ్ల రామనర్సమ్మ(80) అనారోగ్యంతో సోమవారం మృతి చెందారు. తొలి ఎంపీపీగా మండల వాసులకు అనేక సేవలు అందించారు. ఆమె మృతి పట్ల రామన్నగూడెం సర్పంచ్, నెల్లికుదురు సర్పంచ్‌లు కాశమల్ల పద్మ, బీరవెల్లి యాదగిరిరెడ్డి, ఎంపీటీసీ పెరమాండ్ల సుమలత, కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకులు కాసం లక్ష్మారెడ్డి, దేవయ్య, రాజమల్లు మహేందర్, సలుగు హనుమం తు, రావుల సతీష్, కాసం లక్ష్మీచంద్రశేఖర్‌రెడ్డి, ఆకుతోట సోమ నర్సయ్య సంతాపం వ్యక్తం చేశారు.

ప్రజా పాలన దరఖాస్తుల స్వీకరణకు ఏర్పాట్లు

▸▸ హాజరు కానున్న ఎమ్మెల్యే మురళీనాయక్



కేసముద్రం స్టేషన్‌లో ప్రజా పాలనకు బారికేడ్లను ఏర్పాటు చేస్తున్న జీపీ సిబ్బంది

కేసముద్రం, జనవరి 1 : కేసముద్రం మండల కేంద్రంలోని మేజర్ గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో స్థానిక జడ్పీ హైస్కూల్‌లో మంగళవారం నిర్వహించే ప్రజా పాలన దరఖాస్తుల స్వీకరణ కోసం ఏర్పాట్లు చేశారు. సుమారు 3,500 దరఖాస్తులు వస్తాయని అంచనా వేస్తూ 22 కౌంటర్లను ఏర్పాటు చేసినట్లు పంచాయతీ కార్యదర్శి అశోక్ కుమార్ తెలిపారు. జనరల్ కౌంటర్లు, హెల్ప్‌లైన్ కౌంటర్లను రెండు చొప్పున ఏర్పాటు చేసినట్లు చెప్పారు. దరఖాస్తుదారుల రద్దీని క్రమబద్ధీకరించేందుకు బారికేడ్లను సైతం ఏర్పాటు చేశారు. కేసముద్రం స్టేషన్, కేసముద్రం విలేజి, కల్వల గ్రామాల్లోని ప్రజా పాలన కార్యక్రమాలకు ఎమ్మెల్యే మురళీనాయక్ హాజరు కానున్నారు.

డంపింగ్ యార్డు నిర్మాణం ఎప్పుడో?

▸▸ చెత్తా చెదారం, వ్యర్థాలతో దుర్గంధం
▸▸ అనారోగ్యం బారిన పడుతున్న ప్రజలు
▸▸ పట్టించుకోని మునిసిపల్ పాలక వర్గాలు



తొర్రూరులోని మునిసిపాలిటీ భవనం

తొర్రూరు, జనవరి 1 : నూతనంగా ఏర్పడిన మునిసిపాలిటీల్లో గత ప్రభుత్వం అభివృద్ధి కోసం అన్ని పనులు చేపడుతున్నామని తెలిపినా డంపింగ్ యార్డుల నిర్మాణంలో తీవ్ర జాప్యం జరిగింది. తొర్రూరు పట్టణంలోని చెత్త, వ్యర్థ పదార్థాలు ప్రజలకు శాపంగా మారి తీవ్ర అనారోగ్యం పాలవుతున్నారు. పంచాయతీ నుంచి మునిసిపాలిటీగా మారి 5 సంవత్సరాలు పూర్తవుతున్నా గత ప్రభుత్వం అభివృద్ధి కోసం ఇచ్చిన హామీలు నీటి మూటలుగా మారాయి. చెత్త సేకరణను మునిసిపాలిటీ ట్రక్కుల ద్వారా సేకరించినా పట్టణంలో చెత్తకుప్పలు దర్శనమిస్తున్నాయి. సేకరించిన చెత్తను పట్టణ శివారులో రోడ్ల వెంబడి వేయడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మునిసిపాలిటీ ఏర్పడిన తర్వాత పట్టణ శివారు సంగడి బోర్డు వద్ద సర్వే నంబరు 110లో ప్రభుత్వం 14 ఎకరాల భూమి కేటాయించగా, రెవెన్యూ అధికారులు మునిసిపాలిటీకి అప్పగించారు.

పట్టణంలో సేకరించిన చెత్తను సిబ్బంది అక్కడికి డంప్ చేస్తున్నారు. కేటాయించిన స్థలంలో చుట్టూ ప్రహరీ గోడ లేకపోవడం, బండలు ఉండటంతో మునిసిపల్ సిబ్బంది ఇష్టారాజ్యంగా చెత్తను యార్డులో రోడ్ల వెంట, ఎక్కడ పడితే అక్కడ పోసి తగలబెడుతున్నారు. దీంతో చుట్టుపక్కల ఉన్న హచ్చు తండా వాసులు పొగతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పొగ ద్వారా శ్వాసకోస వ్యాధులు వస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రహరీ గోడ నిర్మాణం కోసం ప్రభుత్వం రూ.10 లక్షల నిధులు కేటాయించింది. కానీ, ఇప్పటి వరకు టెండర్ పిలవలేదు. స్వచ్ఛ భారత్‌లో పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచాలని ఉన్నతాధికారులుఆదేశాలు జారీ చేస్తున్నా ఇందుకు భిన్నంగా మునిసిపల్ అధికారులు పట్టించుకోవడం లేదు. పట్టణంలోని మెయిన్ రోడ్డు, వివిధ వార్డుల్లో ఎక్కడపడితే అక్కడచెత్త వేయడం, దీనికి తోడు చికెన్, మటన్, చేపల విక్రయాలు రోడ్ల వెంట చేపడుతుండటంతో వ్యర్థాలకు వీధి కుక్కలు గుంపులుగా చేరి బాటసారులను గాయపరుస్తున్నాయి.



పట్టణంలోని వార్డులో పేరుకుపోయిన చెత్త

రోజుకు 30 టన్నుల చెత్త సేకరణ

మునిసిపాలిటీ పరిధిలోని 16 వార్డుల్లో సుమారు 6,700 నివాస గృహాలు ఉన్నాయి. వీటికి తోడు వ్యాపార సముదాయాలు, హోటళ్లు, సినిమా హాళ్లు, ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రులు, విద్యా సంస్థలు, ఇతర నిర్మాణాలు సైతం పెద్ద ఎత్తున చేపడుతుండటంతో పట్టణంలో ప్రతీ రోజు 30 టన్నుల చెత్తను సేకరిస్తున్నారు. 65 మంది పారిశుధ్య సిబ్బంది చెత్తను తరలించేందుకు 2 ట్రాక్టర్లు, 2 ఆటోలు వినియోగిస్తూ డంప్ చేస్తున్నా పూర్తి స్థాయిలో సిబ్బంది చెత్త సేకరించేందుకు ట్రాక్టర్లు లేకపోవడంతో సమస్య అలాగే ఉంటుంది. డంపింగ్ యార్డులో తడి, పొడి చెత్తను వేరు వేరుగా సేకరించి ఎరువులు తయారు చేసేందుకు ప్రభుత్వం యార్డు పరిధిలో షెడ్లు నిర్మించినా వినియోగంలోకి తీసుకురాకపోవడంతో వృథాగానే ఉన్నాయి.



డంపింగ్ యార్డు ప్రాంతంలో నిర్మిస్తున్న ఎఫ్ఎస్‌టీపీ కేంద్రం

నిర్మాణంలోనే ఎఫ్ఎస్‌టీపీ

పట్టణంలో గృహాల నుంచి సేకరించిన మలమూత్రాలను పట్టణ శివారు వివిధ ప్రాంతాల్లో వృథాగా వేయకుండా, కేంద్ర ప్రభుత్వం స్వచ్ఛ భారత్‌లో భాగంగా ఎఫ్ఎస్‌టీపీ (విసర్జన మలమూత్రాల శుద్ధి కేంద్రం) నిర్మాణం చేపట్టింది. ఇక్కడ సేకరించిన మలమూత్రాల ద్వారా ఎరువులు తయారీ చేసేందుకే ఈ నిర్మాణాలున్నాయి. కానీ, అది పూర్తిస్థాయిలో నిర్మాణం కాలేదు. రూ.86 లక్షలతో చేపట్టిన పనులు నిర్మాణ దశలోనే ఆగిపోయాయి. పట్టణంలో చెత్త తరలించకపోవడంతో వీధుల వెంట తీవ్ర దుర్గంధం ఏర్పడటంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సంబంధిత అధికారులకు, ప్రజా ప్రతినిధులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ప్రజలు వాపోతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

'ఆత్మహత్యలతో సమస్యలు పరిష్కారం కావు'

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, జనవరి 1: క్షణికావేశంలో ఆత్మహత్యలకు పాల్పడితే సమస్యలు పరిష్కారం కాకపోగా కుటుంబ సభ్యులకు మరిన్ని సమస్యలు తెచ్చిపెడుతుందని స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ భూక్య మురళీనాయక్ అన్నారు. మహబూబాబాద్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సోమవారం ఆరోగ్యమిత్ర స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఆత్మహత్యల నివారణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... జీవితంలో అనేక ఒడిదొడుకులు ఎదురవుతాయని, వాటిని విచక్షణ, తెలివితో పరిష్కరించుకోవాలే తప్ప ఆత్మహత్యలు సరికావని సూచించారు. ఆత్మహత్యలు చేసుకోవడం వలన కుటుంబ సభ్యులు మరింత ఇబ్బందులు ఎదుర్కొంటారనే ఆలోచన చేయాలన్నారు. సదస్సుకు హాజరైన వారిచే ఎన్ని సమస్యలు వచ్చినా ఆత్మహత్యలకు పాల్పడమని ప్రమాణం చేయించారు.డాక్టర్ పరికిపండ్ల అశోక్, డాక్టర్ ఉమ, వన్నాల సాగర్, మురళి, కస్తూరి శ్రీనివాస్, సామల లక్ష్మీనారాయణ, దాసరి శ్రీనివాస్, సాంబమూర్తి, కిరణ్ పాల్గొన్నారు.

న్యూ ఇయర్ వేడుకల్లో విషాదం

▸▸ పొగమంచుతో డివైడర్‌ను ఢీకొట్టిన స్కూటీ
▸▸ హైదరాబాద్ పటాన్‌చెరువు సమీపంలో ఘటన
▸▸ జనగామ జిల్లాకు చెందిన ఇద్దరు బీటెక్ విద్యార్థుల మృతి

బచ్చన్నపేట/పాలకుర్తి, జనవరి 1 : నూతన సంవత్సర వేడుకల్లో సంతోషంగా పాల్గొని తిరిగి వస్తున్న విద్యార్థులను మృత్యువు వెంటాడింది. పొగమంచు వల్ల వారు ప్రయాణిస్తున్న స్కూటీ డివైడర్‌ను ఢీకొట్టిన ఘటనలో బీటెక్ చదువుతున్న ఇద్దరు విద్యార్థులు అక్కడికక్కడే దుర్మరణం చెందగా, మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. జనగామ జిల్లా బచ్చన్నపేట మండలం ఆలీంపూర్ గ్రామానికి చెందిన పాకాల నితిన్(18), పాలకుర్తి మండలం రాఘవాపురం గ్రామానికి చెందిన రాగం భరత్ చందర్(19)తో పాటు ఖమ్మంనకు చెందిన మరో విద్యార్థి ఎ.వంశీ సంగారెడ్డి జిల్లా సుల్తాన్‌పూర్ జేఎన్‌టీయూలో బీటెక్ మొదటి సంవత్సరం చదువుతున్నారు. వీరు ఆదివారం రాత్రి 7 గంటల ప్రాంతంలో న్యూ ఇయర్ వేడుకల్లో పాల్గొనేందుకు స్కూటీపై పటాన్‌చెరువు వైపు బయలుదేరారు. రుద్రారం గ్రామ శివారులోని సీటీ ప్యాలెస్ హోటల్లో భోజనాలు చేసిన తరువాత దుర్గంచెరువు వద్దకు వెళ్లారు. న్యూ ఇయర్ వేడుకల్లో పాల్గొని తెల్లవారుజామున సంగారెడ్డికి బయలుదేరారు. 3 గంటలప్రాంతంలో పటాన్ చెరువు దాటగానే నవోపాన్ చౌరస్తా వద్ద దట్టమైన పొగమంచు వల్ల రోడ్డు సరిగా కనబడక డివైడర్‌ను ఢీకొట్టారు. దీంతో స్కూటీ నడుపుతున్న భరత్‌చందర్, వెనుకాల కూర్చున్న నితిన్ అక్కడికక్కడే మృతి చెందారు. వెనుక కూర్చొన్న వంశీ గాయాలపాలయ్యాడు. పటాన్‌చెరువు పోలీసులు హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకుని గాయపడిన వంశీని ఆస్పత్రికి తరలించారు. ఇద్దరి మృతదేహాలను పటాన్‌చెరువు ఏరియా ఆస్పత్రికి తరలించారు.



నితిన్ (ఫైల్), భరత్‌చందర్ (ఫైల్)

ఇరు కుటుంబాల్లో విషాదం..

రోడ్డు ప్రమాదంతో మృతి చెందిన వారిలో నితిన్ తండ్రి ఏడాది క్రితం మృతి చెందగా, తల్లి సంతోష కూలి పనులు చేస్తూ నితిన్‌ను చదివిస్తోంది. ఇక భరత్‌చందర్ తల్లిదండ్రులకు ఏకైక కుమారుడు. ఇద్దరు అక్కలు ఉన్నారు. తల్లిదండ్రులు రాగం రాజన్న-రజిత దంపతులది వ్యవసాయ కుటుంబం. రెక్కల కష్టాన్ని నమ్ముకొని కష్టపడి పిల్లలను చదివిస్తున్నారు. కుటుంబానికి ఆధారంగా నిలుస్తాడనుకున్న కుమారుడు అకాల మృతి చెందడంతో కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరవుతున్నారు. పోస్ట్‌మార్టం అనంతరం వీరి మృతదేహాలు సోమవారం రాత్రి వరకు స్వగ్రామాలకు చేరుకునే అవకాశం ఉంది.

స్వేరోస్ రాష్ట్ర జనరల్ సెక్రెటరీగా ప్రకాశ్

చిన్నగూడూరు,జనవరి 1:స్వేరోస్ చీఫ్ కన్వీనర్ బల్గూరి దుర్గయ్య ఆధ్వర్యంలో సోమవారం రాష్ట్ర నూతన కమిటీ నియామకం చేపట్టగా, స్వేరోస్ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ మమిడాల ప్రవీణ్, వైస్ చైర్మన్ బాలప్రసాద్‌లు ప్రకటించారు. 8 ఏళ్ల పాటు వివిధ స్వేరో కమిటీల్లో పనిచేసిన చిన్నగూడూరు మండలం ఉగ్గంపల్లి గ్రామానికి చెందిన దారమల్ల ప్రకాశ్‌ను రాష్ట్ర జనరల్ సెక్రెటరీగా నియమిస్తున్నట్లుగా ప్రకటన జారీ చేశారు. కాగా, తన ఎన్నికకు సహకరించిన ప్రతి ఒక్కరికి ప్రకాశ్ ధన్యవాదాలు తెలిపారు.

మాజీ ఎమ్మెల్యే స్వగృహంలో మహా పడిపూజ



మహాపడి పూజ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్

మహబూబాబాద్ టౌన్, జనవరి 1 : మానుకోట మాజీ ఎమ్మెల్యే బానోత్ శంకర్ నాయక్ తన స్వగృహంలో సోమవారం మహా పడిపూజ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతి ఏటా మాదిరిగానే నూతన సంవత్సరం రోజున హనుమకొండలో మహా పడిపూజ చేశారు. కేరళ రాష్ట్రంలోని శబరిని పోలిన తరహాలో 18 మెట్లను తయారు చేసి ప్రత్యేక పూజలు చేశారు. మహబూబాబాద్ అయ్యప్పస్వామి దేవాలయ పూజారి సంజీవ నంబూద్రి మంత్రోచ్ఛరణల నడుమ మహా పడిపూజ ఘనంగా నిర్వహించారు. అయ్యప్ప స్వాములు పెద్ద ఎత్తున తరలివచ్చి భజనలు చేశారు. కార్యక్రమంలో మానుకోట మునిసిపల్ చైర్మన్ పాల్వాయి రాంమోహన్‌రెడ్డి, చిట్యాల జనార్దన్, కర్పూరపు గోపి, దౌలాగర్ శంకర్, గోగుల రాజు, శివ, మందుల రఘు పాల్గొన్నారు.

ఘనంగా నూతన సంవత్సర వేడుకలు

(5వ పేజీ తరువాయి)

చేశారు. క్యాంపు కార్యాలయానికి నియోజకవర్గంలోని కాంగ్రెస్ నేతలు, ప్రజాప్రతినిధులు పెద్ద ఎత్తున తరలివచ్చి పుష్పగుచ్ఛాలందించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. నియోజకవర్గ పరిధిలోని అధికారులు ఎమ్మె ల్యేను మర్యాద పూర్వకంగా కలుసుకుని శుభాకాంక్షలు తెలిపారు. తొలుత అనంతారం శ్రీవెంకటేశ్వర స్వామి దేవాలయంలో ఎమ్మెల్యే మురళీనాయక్-ఉమ దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో చుక్కల ఉదయ్‌చందర్, కోడి శ్రీను, ఎడ్ల రమేష్, సీతారాములు పాల్గొన్నారు. సీపీఐ వీర భవన్‌లో మునిసిపల్ ఫ్లోర్‌లీడర్ బి.అజయ్‌సారథిరెడ్డి కేక్ కట్ చేయగా పట్టణ కార్యదర్శి పెరుగు కుమార్, రేషపల్లి నవీన్, పాండు రంగాచారి, చింతకుంట్ల వెంకన్న, తండా సందీప్, రవి, నర్రా శ్రావణ్, రమేష్, వీరన్న పాల్గొన్నారు. అనంతారంలోని శ్రీవెంకటేశ్వర స్వామి దేవాలయం వద్ద ఆదివాసీ కాంగ్రెస్ జాతీయ వైస్ చైర్మన్ తేజావత్ బెల్లయ్యనాయక్, సుజాత దంపతుల ఆధ్వర్యంలో అన్నదానం చేశారు.

జిల్లా పోలీసు కార్యాలయంలో..

మహబూబాబాద్ జిల్లా పోలీసు కార్యాలయంలో నూతన సంవత్సర వేడుకలను నిర్వహించారు. జిల్లా ఎస్పీ సంగ్రామ్‌సింగ్‌జీ పాటిల్ కేక్ కట్ చేశారు. జిల్లా ప్రజలకు, పోలీసు అధికారులకు, సిబ్బందికి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ... గడిచిన సంవత్సరం పోలీసు శాఖలో నూతన ఒరవడితో అధునాతన సాంకేతికత అందించడమే కాకుండా సిబ్బంది పూర్తి స్థాయి విధి నిర్వహణకు ఎంతో దోహద పడిందన్నారు. నూతన సంవత్సరంలో అధికారులు, సిబ్బంది లక్ష్యాలను నిర్దేశించుకుని పని చేయాలన్నారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ జోగుల చెన్నయ్య, డీఎస్పీలు విజయ్‌ప్రతాప్, తీర్థాల సత్యనారాయణ, గంద్రాతి మోహన్, సీఐలు సతీష్, రమేష్, ఫణిధర్, శ్రీనివాస్, ఎస్సైలు రామారావు, రమాదేవి, వెంకన్న పాల్గొన్నారు.

వివిధ మండలాల్లో..

జిల్లాలోని మరిపెడ మునిసిపల్ కేంద్రంలో అర్ధరాత్రి నూతన సంవత్సరానికి కేరింతలు కొట్టి స్వాగతించారు. నూతన సంవత్సర వేడుకల్లో మునిసిపల్ చైర్‌పర్సన్ సింధూరకుమారి, కమిషనర్ రాజు పాల్గొన్నారు. దంతాలపల్లి మండలంలోని పెద్దముప్పారంలో జడ్పీ వైస్ చైర్మన్ నూకల వెంకటేశ్వరరెడ్డి, రామానుజపురంలో ఎంపీపీ ఉమ, సర్పంచ్ సుష్మితరవీందర్, కొత్తగూడలో ఎంపీపీ బానోత్ విజయరూప్ సింగ్, జడ్పీటీసీ పుష్పలత, సర్పంచ్‌లు రాజేశ్వర్, రణధీర్, వెంకటలక్ష్మి, నర్సయ్య, ఎంపీటీసీలు పుష్పలత, సంతోషరాణి, సదానందం, స్వప్నలింగన్న పాల్గొన్నారు. డోర్నకల్ మునిసిపల్ కేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లో యువత బాణసంచాలు కాల్చి కేక్‌లు కట్ చేశారు. డోర్నకల్ సీఎస్ఐ చర్చిలో బిషప్ కోడిరెక్క పద్మారావు, ఆదివాసీ కాంగ్రెస్ జాతీయ వైస్ చైర్మన్ తేజావత్ బెల్లయ్యనాయక్ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో సుమీర్‌చంద్‌జైన్, మాద శ్రీనివాస్, శ్రీను, హరికృష్ణ, సునిల్‌కుమార్ జైన్ పాల్గొన్నారు.

కురవి మండల కేంద్రంలో నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని శ్రీ వీరభద్రస్వామి దేవాలయానికి భక్తులు పోటెత్తారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలిరావడంతో ఆలయ పరిసరాలు కిటకిట లాడాయి. అర్చనలు, వాహన పూజలతో ఆలయ పరిసరాలు హోరెత్తాయి. ఆలయ అధికారులు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. మానుకోట మునిసిపల్ చైర్మన్ పాల్వాయి రాంమోహన్ రెడ్డి దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. బయ్యారం మండల కేంద్రంలో నూతన సంవత్సర వేడుకల్లో కేక్‌లు కట్ చేశారు.



మహబూబాబాద్‌లో కేక్ కట్ చేస్తున్న సీపీఐ ఫ్లోర్ లీడర్ అజయ్‌సారథిరెడ్డి



మహబూబాబాద్‌లో రంగురంగుల ముగ్గులు వేస్తున్న మహిళలు



కురవి వీరభద్రస్వామి దేవాలయంలో బారులు తీరిన భక్తులు

యువత ప్రత్యక్ష రాజకీయాల్లోకి రావాలి

తొర్రూరు, జనవరి 1: యువత ప్రత్యక్ష రాజకీయాల్లోకి వస్తేనే సమాజంలో బలమైన నాయకత్వం ఎదుగుతుందని నేషనల్ బేడ బుడగ జంగాల రిజర్వేషన్ పోరాట సమాఖ్య వ్యవస్థాపక అధ్యక్షుడు పస్తం సైదులు అన్నారు. తొర్రూరులో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎస్సీ ఉప కులాల్లో అత్యధిక జనాభా కలిగి ఉన్నది బేడ బుడగ జంగాలే అన్నారు. వారు ఆర్థికంగా, సామాజికంగా వెనకబడి ఉన్నారని తెలిపారు. తాము అభివృద్ధి చెందాలంటే యువత రాజకీయాల్లో భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. అనంతరం సమాఖ్యలో చేరిన వారికి సభ్యత్వాలు అందజేస్తూ, రాష్ట్ర నూతన కమిటీని ఏర్పాటు చేసి నియామక పత్రాలు అందించారు. సమావేశంలో సంఘం నాయకులు అల్లం అర్జున్ రాజు, వెంకటాచలం, హుస్సేన్, భిక్షం, గురువయ్య, లక్ష్మణ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



నూతన కమిటీలకు నియామక పత్రాలు అందిస్తున్న పస్తం సైదులు

న్యాయమూర్తి, ఎంపీ, ఎమ్మెల్యేకు..
అయోధ్య సీతారాముల అక్షింతలు అందజేత



ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్‌కు అయోధ్య రామాలయ అక్షింతలు అందజేస్తున్న విశ్వహిందు పరిషత్ బాధ్యులు



డీఎస్పీ సత్యనారాయణకు అయోధ్య రామాలయ అక్షింతలు అందజేస్తున్న విశ్వహిందు పరిషత్ బాధ్యులు

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, జనవరి 1 : మహబూబాబాద్ లో అయోధ్య శ్రీసీతారాముల అక్షింతలను విశ్వహిందు పరిషత్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎలమంచిలి వెంకటేశ్వరరావు, పోరిక కృష్ణమోహన్ అందజేశారు. ఈ మేరకు శ్రీ రామజన్మభూమి దీర్థక్షేత్ర ట్రస్టు ద్వారా పట్టణానికి తీసుకువచ్చిన అయోధ్య శ్రీరామచంద్రమూర్తి అక్షింతలను సోమవారం జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి చంద్రశేఖరప్రసాద్, మానుకోట పార్లమెంటు సభ్యురాలు మాలోతు కవిత, స్థానిక శాసన సభ్యుడు భూక్య మురళీనాయక్, డీఎస్పీ సత్యనారాయణలకు వారి స్వగృహాలకు వెళ్లి అందజేశారు. ఆయా కార్యక్రమాల్లో మాలె యోగీశ్వర్‌రావు, సునీత, ఈగ శ్రీనివాస్, రమ్య, జంగాల సదాశివుడు, జ్యోతి, మాలె నవీన్, ప్రసన్న, శ్రవణ్‌కుమార్, భవాని, పెనుగొండ నలిన్‌కుమార్, నవ్య, శ్రీరంగం నవీన్, సరళ, ఇమ్మడి కృష్ణ, నాగమణి, బొల్లం నాగేశ్వర్‌రావు, సరస్వతి, వల్లాల రమేష్, ఏకాంబరం పాల్గొన్నారు.



న్యాయమూర్తి చంద్రశేఖరప్రసాద్‌కు అక్షింతలు అందజేస్తున్న విశ్వహిందు పరిషత్ బాధ్యులు

నిశ్చితార్థం జరిగిన పది రోజులకే..

▸▸ వేధింపులు తట్టుకోలేక యువతి ఆత్మహత్య
▸▸ జనగామ జిల్లా ఇప్పగూడెంలో ఘటన

స్టేషన్‌ఘన్‌పూర్, జనవరి 1 : నిశ్చితార్థం జరిగిన పది రోజులకే ఓ యువతి ఆత్మహత్య చేసుకుంది. యువకుడి వేధింపులు భరించలేక బలవన్మరణానికి పాల్పడింది. గ్రామస్థులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జనగామ జిల్లా స్టేషన్‌ఘన్‌పూర్ మండలం ఇప్పగూడెం గ్రామానికి చెందిన లింగనబోయిన సోమయ్య-సుజాత దంపతులకు ఇద్దరు కుమార్తెలు ఉండగా, పెద్ద కుమార్తె అయిన లింగనబోయిన వసంత (19) ఘన్‌పూర్ మోడల్ స్కూల్‌లో ఇంటర్ సెకండ్ ఇయర్ చదువుతోంది. ఆమెకు గత నెలలో రఘునాథపల్లి మండలం గబ్బెట గ్రామానికి చెందిన నర్సింగుల హరీష్ అనే యువకుడితో వివాహం నిశ్చయించారు. డిసెంబరు 22వ తేదీన పెద్ద మనుషుల సమక్షంలో నిశ్చితార్థం చేశారు. కట్నం కింద రూ.20వేలు అందించారు. ఈ క్రమంలో డిసెంబరు 31న అర్ధరాత్రి 2గంటల ప్రాంతంలో హరీష్ తన స్నేహితుడితో కలిసి వసంత ఇంటికి వచ్చాడు. వసంత తండ్రిని నిద్రలేపి మీ కూతురును పిలువమని చెప్పడంతో వసంత లేచి బయటకు వచ్చింది. ఆమెతో కొంత సమయం మాట్లాడిన హరీష్ 'మీ కూతురు రోజూ ఎవరితోనో ఫోన్లో మాట్లాడుతోంది, నేను ఆమెను వివాహం చేసుకోను, మీరు కట్నం కింద ఇచ్చిన రూ.20వేలకు అదనంగా మరో రూ.20వేలు కలిపి ఇస్తాను' అని తండ్రి సోమయ్యకు చెప్పాడు. దీంతో ఆయన 'రాత్రి వేళ ఇంటికి వచ్చి ఇలా మాట్లాడితే ఎలా.. రేపు ఉదయం పెద్దమనుషుల సమక్షంలో మాట్లాడుకుందాం' అని సర్ది చెప్పినప్పటికీ వినకుండా వెళ్లిపోయాడు. దీంతో మనస్తాపం చెందిన వసంత సోమవారం ఉదయం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరేసుకుంది. మధ్యాహ్నం ఇంటికి వచ్చిన చెల్లెలు కావ్య ఫ్యాన్‌కు వేలాడుతున్న అక్కను చూసి బోరున విలపించింది. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం వరంగల్ ఎంజీఎంకు తరలించారు. తండ్రి సోమయ్య ఫిర్యాదు మేరకు సీఐ సట్ల రాజు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



వసంత మృతదేహాన్ని పరిశీలిస్తున్న సీఐ రాజు